

టన్ను చీనీ రూ.15 వేలు
అనంతపురం మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.15 వేలు, కనిష్టం రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.



దమ్ముంటే పట్టుకోండి
దొంగలు పుట్టపర్తి పోలీసులకు సవాల్ విసిరారు. ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలోని దాదాపు 9 ఇళ్లను దోచుకున్నారు.

8లో

గరిష్టం/కనిష్టం
34.1°/21.4°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలి వేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

సికింద్రాబాద్-తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: తిరుమల వెళ్లే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని సికింద్రాబాద్-తిరుపతి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు (07009, 07010) నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 నుంచి ఆగస్టు 28 వరకు ప్రతి గురువారం (5 సర్వీసులు మాత్రమే) రైళ్లు రాకపోకలు సాగిస్తాయన్నారు. కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల, కర్నూలు, డోన్, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, రేణిగుంట స్టేషన్ల మీదుగా వెళ్తాయన్నారు.

నాందేడ్-ధర్మవరం మధ్య..
నాందేడ్-ధర్మవరం మధ్య ఆగస్టు 1 నుంచి 31వ తేదీ వరకు ప్రతి శుక్రవారం, ఆదివారం రైళ్లు నడుపుతున్నట్లు శ్రీధర్ తెలిపారు. నాందేడ్ జంక్షన్ (07189) నుంచి ఆగస్టు 1 (శుక్రవారం) రైలు బయలు దేరుతుందన్నారు. అలాగే, ఆగస్టు 3 (శనివారం) తిరుపతి జంక్షన్ నుంచి బయలుదేరుతుంది. ధర్మబాద్, బాసర, నిజామబాద్, కామారెడ్డి, నెలగొండ, మిర్యాలగూడ, నడికుడి, రంపిచర్ల, వినుకొండ, కంభం , గిద్దలూరు, నంద్యాల, జమ్మలమడుగు, యర్రగుంట్ల, కడప, రాజంపేట, కోడూరు, రేణిగుంట, తిరుపతి, పాకాల, పీలేరు, కదిరి స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగిస్తాయన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టీడీపీ నేతలకు పతనం తప్పదు



ఈరలక్కప్ప

మడకశిర: రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న టీడీపీ నేతలకు రాజకీయ పతనం తప్పదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మడకశిర నగర పంచాయతీ ఎన్నికలో టీడీపీ నేతలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారన్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి ప్రజాతీర్పును అగౌరవపరచిన టీడీపీ నేతలను రానున్న ఎన్నికల్లో ప్రజలే ఓటుతో శిక్షించడం ఖాయమన్నారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసి తమవైపునకు తిప్పుకుని నగర పంచాయతీ దక్కించుకున్నామని సంబరపడుతున్న టీడీపీ నేతలకు దమ్ము, ధైర్యం ఉంటే నేరుగా ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలన్నారు. ఏడాది కాలంలో టీడీపీ నేతలు కుట్రలు, కుతంత్రాలు, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేయడం పైనే నిమగ్నమై... మడకశిర అభివృద్ధిని పూర్తిగా పక్కనపెట్టారని ఈరలక్కప్ప ఆరోపించారు.

మంచికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు..
టీడీపీ నేతల ప్రలోభాలకు లొంగకుండా మంచికి అండగా నిలిచిన కౌన్సిలర్లందరికీ ఈరలక్కప్ప ధన్యవాదాలు తెలిపారు. ఎన్ని కష్టాలు ఎదురైనా, ఎంతమంది భయపెట్టినా వైఎస్సార్ సీపీకి అండగా నిలిచిన కౌన్సిలర్లు అందరినీ పార్టీ తప్పకుండా గుర్తిస్తుందన్నారు. నగర పంచాయతీని కోల్పోయినంత మాత్రాన ఆందోళన చెందాల్సిన పనిలేదని, మరో 8 నెలల్లో మళ్లీ నగర పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని అప్పుడు ప్రజా మద్దతు సత్తా చాటుదామని ఆయన పిలుపునిచ్చారు.

పరిటాలకు పరాభవం

సొంత మండలం రామగిరిపై పట్టునిలుపుకోవాలని భావించిన పరిటాల సునీతకు పరాభవం ఎదురైంది. మెజార్టీ లేకపోయినా అప్రజాస్వామిక పద్ధతుల్లో ఎంపీపీ పీఠం దక్కించుకోవాలని ఆమె వేసిన పాచిక పారలేదు. అధికారంలో ఉన్నా...అన్ని వ్యవస్థలనూ వాడుకున్నా రామగిరి ఎంపీపీ స్థానాన్ని దక్కించుకోలేక భంగపడ్డారు.

- రామగిరి ఎంపీపీ ఎన్నికలో పారని పాచిక
- ఎన్ని కుతంత్రాలు చేసినా దక్కని పీఠం
- కేవలం ఇద్దరు ఎంపీటీసీ సభ్యులు మాత్రమే హాజరు
- రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఎంపీటీసీల గైర్హాజరు
- ఎంపీపీ ఎన్నిక నిరవధిక వాయిదా వేస్తున్నట్లు అధికారుల ప్రకటన





రామగిరి ఎంపీడీఓ కార్యాలయం ముందు బందోబస్తు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: అధికార పార్టీ కిడ్నాప్‌లు... దాడులతో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన రామగిరి ఎంపీపీ ఎన్నిక బుధవారం మరోసారి నిరవధికంగా వాయిదా పడింది. అధికారం చేతుల్లో ఉంది... ఏమైనా చేయవచ్చుననుకున్న 'పరిటాల' కుటుంబానికి సొంత మండలం పైనే పట్టుచిక్కక తీవ్ర పరాభవం ఎదురైంది. మెజార్టీ లేకపోయినా ఎంపీపీ పీఠం కైవసం చేసుకోవాలన్న లక్ష్యంతో... బెదిరింపులకు దిగినా వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలంతా ప్రజాతీర్పువైపే నిలబడటంతో 'పరిటాల'కు మరోసారి భంగపాటు తప్పలేదు.

ఇద్దరు మాత్రమే హాజరు..
రామగిరి ఎంపీపీ ఎన్నిక కోసం అధికారులు బుధవారం ఏర్పాట్లు చేశారు. రామగిరి ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అయితే 10 మంది ఎంపీటీసీలకు గాను నసనకోట ఎంపీటీసీ శ్రీనివాసులు, పేరూరు-1 ఎంపీటీసీ కక్రెన్న మాత్రమే ప్రత్యేక సమావేశానికి హాజరయ్యారు. వారిద్దరూ పురుషులు కావడం...ఎంపీపీ స్థానం మహిళకు రిజర్వు అయిన నేపథ్యంలో ఎన్నికల అధికారి సంజీవయ్య రామగిరి ఎంపీపీ ఎన్నికను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు ఎప్పుడు ఎన్నికల తేదీని ప్రకటిస్తే మళ్లీ అప్పుడు రామగిరి ఎంపీపీ ఎన్నికను నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

10 మందిలో తొమ్మిదిమంది వైఎస్సార్ సీపీ వారే...
గత స్థానిక సంస్థల ఎన్నికల్లో 'పరిటాల' సొంత మండలం రామగిరిలో వైఎస్సార్ సీపీ విజయ ఢంకా మోగించింది. మండలంలో తొమ్మిది పంచాయతీలుండగా ఏడు పంచాయతీల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులే ఘన విజయం సాధించారు. ఇక మండలంలో 10 ఎంపీటీసీ స్థానాలు ఉండగా... 9 స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులే విజేతలుగా నిలిచి తొలిసారి రామగిరిలో ఎంపీపీ పీఠాన్ని కైవసం చేసుకున్నారు. ఎంపీపీ స్థానం మహిళకు రిజర్వు కావడంతో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మీనుగ నాగమ్మను పీఠంపై కూర్చోబెట్టారు.

ప్రజాతీర్పును గౌరవించి.. ఎన్నికను బహిష్కరించి
వైఎస్సార్‌సీపీకి చెందిన ఆరుగురు ఎంపీటీసీలు ప్రజాతీర్పును గౌరవించారు. వైఎస్సార్ సీపీ బ్యాలెట్ గుర్తుపై గెలిచిన వారంతా పార్టీ నిర్ణయానికి కట్టుబడ్డారు. టీడీపీ నాయకులు ఎంతలా ప్రలోభపెట్టినా..భయపెట్టినా వెనక్కు తగ్గలేదు. అధికారం అండతో అప్రజాస్వామికంగా ఎంపీపీ పీఠం దక్కించుకునేందుకు రెడ్‌బుక్ రాజ్యాంగం అనుసరిస్తున్న అధికార పార్టీ చర్యలను నిరసిస్తూ బుధవారం జరిగిన ఎంపీపీ ఎన్నికను బహిష్కరించినట్లు ప్రకటించారు.

మూడోసారి విఫలం

2024 డిసెంబర్ 30వ తేదీన రామగిరి ఎంపీపీ మీనుగ నాగమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో ఎన్నిక అనివార్యమైంది. దీంతో ఎలాగైనా సొంతమండలం రామగిరిలో పట్టునిలుపుకోవాలని పరిటాల కుటుంబం భావించింది. కేవలం ఒకే ఒక్క పురుష ఎంపీటీసీతో అప్రజాస్వామ్య పద్ధతిలో ఎంపీపీ స్థానం కైవసం చేసుకోవాలని ప్లాన్ వేసింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు మార్చి 27న రామగిరి ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్ ఇచ్చారు. టీడీపీ తరఫున నసనకోట ఎంపీటీసీ శ్రీనివాసులు మాత్రమే ఉండగా... పేరూరు-1 ఎంపీటీసీ కక్రెన్నతో పాటు మాధాపురం ఎంపీటీసీ సంపత్‌కుమార్‌ను బలవంతంగా పార్టీలో చేర్చుకున్నారు. అయినా అప్పుడు ఎన్నిక వాయిదా పడగా, మే 19న మరోమారు నోటిఫికేషన్ ఇచ్చారు. ఎంపీపీ స్థానం మహిళకు రిజర్వు కావడంతో రెండోసారి ఏకంగా పేరూరు-2 ఎంపీటీసీ సభ్యురాలు భారతమ్మను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించి భంగపడ్డారు. దీంతో రెండు సార్లు ఎంపీపీ స్థానాన్ని కైవసం చేసుకోవాలని దెబ్బతిన్న పరిటాల కుటుంబం తాజాగా బుధవారం జరిగిన ఎన్నికలోనైనా పీఠం దక్కించుకోవాలని భావించింది. అయితే వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలెవరూ సమావేశానికి హాజరు కాకపోవడంతో వారి పథకం పారలేదు.

నవీన్ నిశ్చల్, కొండూరు సస్పెన్షన్

- పార్టీ వ్యతిరేక కార్యకలాపాల నేపథ్యంలో వైఎస్సార్ సీపీ నిర్ణయం

చిలమత్తూరు: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న నేపథ్యంలో నవీన్ నిశ్చల్, కొండూరు వేణుగోపాల్‌రెడ్డిలను వైఎస్సార్ సీపీ సస్పెండ్ చేసింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో వైఎస్సార్ సీపీ హిందూపురం సమన్వయకర్తలుగా పనిచేసిన నవీన్ నిశ్చల్, కొండూరు వేణుగోపాల్‌రెడ్డి కొంతకాలంగా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు అందాయి. వాటిని విచారించిన క్రమశిక్షణ కమిటీ నివేదిక ఆధారంగా వారిద్దరినీ సస్పెండ్ చేస్తూ పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది.

విద్యార్థి అనుమానాస్పద మృతి

- నెల్లూరు జీజీహెచ్ ఎదుట స్నేహితుల ఆందోళన



శ్రీకాంత్ మృతదేహం

నెల్లూరు సిటీ: ఓ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలానికి చెందిన జానా శ్రీకాంత్ (23) నెల్లూరు రూరల్ పరిధిలోని కాకుపల్లి గ్రామంలో ఉన్న సన్ ఫార్మసీ కళాశాలలో పీజీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద రమణయ్య హాస్పిటల్లో ఫార్మసిస్ట్‌గా పార్ట్‌టైం పనిచేస్తున్నాడు. బుధవారం శ్రీకాంత్ హాస్పిటల్లో విధుల్లో ఉండగా కింద పడిపోయాడు. దీంతో సిబ్బంది ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. దీంతో మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న శ్రీకాంత్ స్నేహితులు జీజీహెచ్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు. శ్రీకాంత్ ఆస్పత్రిలో విద్యుదాఘాతానికి గురై చనిపోయాడని ఆరోపించారు. అయితే సిబ్బంది మాత్రం హార్ట్ ఎటాక్ అని చెప్పడంపై అనుమానం వ్యక్తం చేశారు. వారి నిర్లక్ష్యంతోనే తమ స్నేహితుడు మృతిచెందాడని ఆగ్రహించారు. ఈ క్రమంలో జీజీహెచ్ వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రలోభపెట్టి.. పదవులు పొంది

- మడకశిర నగర పంచాయతీ చైర్మన్, వైస్ చైర్‌పర్సన్ పదవులు టీడీపీ కైవసం
- చైర్మన్‌గా నరసింహరాజు, వైస్ చైర్‌పర్సన్‌గా ప్రభావతి ఎన్నిక
- ఎన్నికను బహిష్కరించిన ఆరుగురు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు



ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్న ఎన్నికల అధికారి ఆనందకుమార్, హాజరైన కౌన్సిలర్లు, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర: ప్రలోభపెట్టారు... అందుకు లొంగనివారిని భయపెట్టారు.. అధికారం కోసం పూర్తిగా దిగజారి ప్రవర్తించారు. చివరకు 9 మంది వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల మద్దతుతో మడకశిర నగర పంచాయతీ చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాలను టీడీపీ నేతలు కైవసం చేసుకున్నారు.

చైర్మన్‌గా నరసింహరాజు, వైస్ చైర్‌పర్సన్‌గా ప్రభావతి..
మడకశిర నగర పంచాయతీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోసం అధికారులు బుధవారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం సమావేశం నిర్వహించారు. పెనుకొండ ఆర్డీఓ ఆనందకుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా.. ఎక్స్ అఫిషియో సభ్యుడి హోదాలో స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పాల్గొన్నారు. నగర పంచాయతీలో 20 మంది కౌన్సిలర్లు ఉండగా... సమావేశానికి 14 మంది కౌన్సిలర్లు, ఎక్స్ అఫిషియో సభ్యుడు ఎంఎస్ రాజు హాజరయ్యారు. చైర్మన్ స్థానానికి టీడీపీకి చెందిన 15వ వార్డు కౌన్సిలర్ నరసింహరాజు, వైస్ చైర్మన్ స్థానానికి టీడీపీకి చెందిన 4వ వార్డు కౌన్సిలర్ ప్రభావతి నామినేషన్లను దాఖలు చేయగా.. మిగతా వారు బలపరిచారు. దీంతో నరసింహరాజు చైర్మన్‌గా, ప్రభావతి వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఆనందకుమార్ ప్రకటించారు. కాగా, పదవుల ఆశతో టీడీపీలో చేరిన 9 మంది వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లలో ఏ ఒక్కరికీ పదవులు దక్కలేదు. చైర్మన్ పదవిపై ఆశతో టీడీపీలో చేరిన 17వ వార్డు కౌన్సిలర్ సుభద్రను కూడా టీడీపీ నేతలు మోసం చేశారు.

ఎన్నికను బహిష్కరించిన కౌన్సిలర్లు
అప్రజాస్వామిక పద్ధతిలో నిర్వహించిన మడకశిర చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు బహిష్కరించారు. మడకశిరలో 20 వార్డులుండగా... గత మున్సిపల్ ఎన్నికల్లో 15 స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు విజయం సాధించారు. టీడీపీ 5 స్థానాలతో సరిపెట్టుకుంది. రాష్ట్రంలో కూటమి సర్కార్ అధికారంలోకి రాగానే పీఠంపై కన్నేసిన టీడీపీ నేతలు...వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసి 9 మందిని లాక్కున్నారు. తాగా ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల మద్దతుతోనే పదవులు దక్కించుకున్నారు. అయితే టీడీపీ నేతలు ఎంతగా ప్రయత్నించినా... లక్ష్మీనరసమ్మ, రామచంద్రారెడ్డి, సతీష్‌రెడ్డి, అన్సర్, శ్రీనివాసులు, అంజన్ కుమార్ యాదవ్ వైఎస్సార్ సీపీని వీడలేదు. తాజాగా ఎన్నికను బహిష్కరించి తాము ప్రజలపక్షమని చాటారు.

ఎక్సైజ్‌పై ఎమ్మెల్యేల పెత్తనం!

- ఎమ్మార్పీకి మించి వసూలు చేసినా కేసులు కట్టొద్దంటూ హుకుం
- ఇటీవల 'పురం'లో కల్లు దుకాణాలపై దాడులు చేశారని ఏసీ బదిలీ
- అక్రమాలపై కేసులు రాయాలంటూ మరోవైపు ఉన్నతాధికారుల ఆదేశాలు
- ఒత్తిళ్ల నడుమ నలిగిపోతున్న ఎక్సైజ్ అధికారులు
- ఒత్తిడి భరించలేక సెలవులకు దరఖాస్తు చేసుకుంటున్న వైనం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: 'కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం' అన్న చందాన మారింది ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎక్సైజ్ అధికారుల పరిస్థితి. మద్యం అక్రమాలకు అడ్డు తగిలితే 'మీకు శంకరగిరి మాన్యాలు చూపిస్తాం' అని ఎమ్మెల్యేల బెదిరింపులు... కేసులు రాయకుండా ఏం చేస్తున్నారంటూ విజయవాడ నుంచి ఉన్నతాధికారుల ఆదేశాలు వెరసి వారి విధులు దినదినగ గండంలా తయారయ్యాయి. ఓ వైపు కేసులు రాయలేక, మరోవైపు ఎమ్మెల్యేల ఒత్తిళ్లు తట్టుకోలేక పలువురు అధికారులు సెలవులో వెళ్లేందుకు సిద్ధపడ్డారు. ఇప్పటికే కొంతమంది దరఖాస్తు చేసుకున్నారు.

గతంలో ప్రశాంతంగా..
అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో గరిష్ట చిల్లర ధర (ఎంఆర్‌పీ) కంటే ఎక్కువ అమ్ముతున్నారు. ఇలా ఇష్టారాజ్యంగా వసూళ్లు చేయడం నిబంధనలకు విరుద్ధం. ఎక్సైజ్ చట్టం ప్రకారం రూ.5 లక్షలు జరిమానా రాయాలి. కానీ రైడింగ్ చేసి కేసులు రాద్దామంటే వెంటనే ఎమ్మెల్యేలు ఫోన్ చేసి కేసులు నమోదు చేయొద్దంటూ హుకుం జారీ చేస్తున్నారు. ఇటీవల పామిడిలో ఓ ప్రజాప్రతినిధి షాపుపై కేసు రాసినందుకు ఎక్సైజ్ అధికారులపై మండిపడినట్లు తెలిసింది. దీంతో ఎమ్మెల్యేల ఒత్తిడితో ఎక్కడా కేసులు నమోదు చేసే పరిస్థితి లేదని వాపోతున్నారు. గతంలో ప్రశాంతంగా విధులు నిర్వహించామని.. ఇప్పుడా పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైడ్స్ చేసినందుకు ఏసీ బదిలీ..
హిందూపురంలో రెండు మాసాల క్రితం ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి కల్తీ కల్లు దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో కేసు నమోదు చేశారు. దీంతో ఆయన్ను ఏకంగా బదిలీ చేశారు. కేసు రాసిన వారంలోనే హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏలు బదిలీ చేయించడంతో మిగిలిన అధికారులు భయపడుతున్నారు. కేసులు నమోదు చేస్తే ఎక్కడ బదిలీ చేస్తారో అంటూ బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఇలాగైతే ఎంతకాలం ఉద్యోగం చేస్తామని శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన ఎక్సైజ్ సీఐ ఒకరు వాపోయారు. ఇప్పటికే బెల్టుషాపులు, పర్మిట్ రూములు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నా ఏమీ అనలేని పరిస్థితిలో ఉన్నామని చెబుతున్నారు.

రూ.1,400 కోట్ల మార్కు దాటేసింది..
ఉమ్మడి జిల్లాలో మద్యం అమ్మకాలు రికార్డు స్థాయిలో జరుగుతున్నాయి. బెల్టుషాపులు, పర్మిట్ రూములు అందుబాటులోకి రావడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. గడిచిన 10 నెలల్లో కూటమి సర్కారు తెచ్చిన కొత్త మద్యం పాలసీతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో రూ.1,400 కోట్లకు పైగా విలువైన మద్యం వినియోగమైంది. రోజూ సగటున రూ.4.69 కోట్ల విలువైన మద్యం వినియోగమవుతుండగా.. ఇటీవల వారం రోజుల పాటు జరిగిన పీర్ల పండగ సందర్భంగా రోజుకు రూ.7 కోట్ల మద్యం తాగినట్లు వెల్లడైంది.

కాలుష్య రహిత గ్రామాలే లక్ష్యం

- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్



సోలార్ రూఫ్ టాప్ పోస్టర్లను విడుదల చేస్తున్న మంత్రి అనగాని, కలెక్టర్ చేతన్ తదితరులు

హిందూపురం టౌన్: కాలుష్య రహిత గ్రామాలే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయని, ఇందుకోసం సౌరశక్తిని విరివిగా వినియోగించాలని భావిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్స్, స్టాంప్స్ శాఖా మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. బుధవారం పట్టణంలో శివారులోని జేవీస్ ప్యాలెస్ ఫంక్షన్ హాలులో కలెక్టర్ టీఎస్ చేతన్‌తో కలిసి 'ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన సబ్సిడీ పథకం'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ.. పీఎం సూర్య ఘర్ పథకంలో మహిళల భాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. కోటి ఇళ్ల మీద రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏ గ్రామంలో అయితే వేగంగా అన్ని ఇళ్ల మీద రూఫ్ టాప్ సోలార్‌ను ఏర్పాటు చేసుకుంటే ఆ గ్రామానికి రూ.కోటి అందిస్తామన్నారు. ఆ నిధులతో గ్రామాన్ని సమగ్రాభివృద్ధి చేసి మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు ప్రభుత్వ సబ్సిడీ ఇస్తుందని, బ్యాంకులు రుణ సౌకర్యాన్ని అందిస్తాయని తెలిపారు. మహిళలు ఆర్థికంగా బాగుపడితే ఆ కుటుంబంతో పాటు ఆ ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల మీద రూఫ్ టాప్ సోలార్‌ను ఏర్పాటు చేసుకుని పర్యావరణాన్ని కాపాడాలన్నారు. సోలార్ ఏర్పాటు వల్ల విద్యుత్తు బిల్లు తగ్గుతుందని తెలిపారు. అనంతరం 'రాయితీతో మీ ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోండి, విద్యుత్తు బిల్లు తగ్గించుకోండి' బ్రోచర్‌ను విడుదల చేశారు. అలాగే ఇప్పటికే తమ ఇళ్ల మీద రూఫ్ టాప్ సోలార్‌ను ఏర్పాటు చేసుకున్న వారికి సన్మానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్, పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, డీఆర్‌డీఏ పీడీ నర్సయ్య, డీపీఓ సమత, ట్రాన్స్‌కో ఎస్‌ఈ సంపత్ కుమార్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

సుపరిపాలనలో సమస్యల ఏకరువు

హిందూపురం: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ చిలమత్తూరు, లేపాక్షి మండలాల్లో పర్యటించగా జనం సమస్యలు ఏకరువు పెట్టారు. బుధవారం ఉదయం మంత్రి చిలమత్తూరు మండలం కోడూరు పంచాయతీ నల్లరాళ్లపల్లి గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్నారు. రెండు, మూడు ఇళ్లకు వెళ్లి ప్రజలతో సంక్షేమ పథకాలు అందాయా అంటూ ఆరా తీశారు. ఈ సందర్భంగా కొందరు మహిళలు సమస్యలు ఏకరువు పెట్టారు. దీంతో ఏం చేయాలో తెలియని మంత్రి సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెబుతూనే...'వాటి గురించి చూడండయ్యా' అంటూ అధికారులపై రుసరుసలాడుతూ ముందుకు సాగారు. అనంతరం లేపాక్షి మండలంలోనూ పర్యటించారు. రచ్చబండ వద్ద మహిళలతో గ్యాస్ సిలిండర్ వచ్చిందా.. అంటూ ఆరా తీయగా.. మహిళలు సిలిండర్లు అందలేదని సమాధానం ఇచ్చారు.

జవాన్ భూమిపై 'పచ్చ' పాగా

- ఏడాది క్రితం దౌర్జన్యంగా ఆక్రమించిన 'తమ్ముళ్లు'
- కొత్తచెరువు మండలం మైలసముద్రంలో ఘటన
- అసోంలో విధులు నిర్వర్తిస్తున్న జవాన్ కేసాని రమేశ్



దౌర్జన్యంగా మామిడి చెట్లు నాటిన టీడీపీ నేతలు

సాక్షి, పుట్టపర్తి

దేశ సరిహద్దులో పని చేసే ఆర్మీ ఉద్యోగుల భూములకు కూటమి ప్రభుత్వంలో రక్షణ లేకుండా పోయింది. జిల్లాలో రెండు నెలల వ్యవధిలోనే ముగ్గురు జవాన్లు తమ భూములు ఆక్రమణలకు గురయ్యాయంటూ కలెక్టరేట్‌ను ఆశ్రయించిన సంగతి తెలిసిందే. తాజాగా కొత్తచెరువు మండలం మైలసముద్రానికి చెందిన జవాన్ తన భూమిని టీడీపీ నేతలు ఆక్రమించారని, దయచేసి తన భూమిని రక్షించాలని వేడేకుంటూ సెల్ఫీ వీడియో రూపొందించి విడుదల చేయడంతో టీడీపీ నేతల భూ ఆక్రమణల పర్వం మరోసారి చర్చనీయాంశమైంది.

ఏళ్లుగా కన్నేసి.. కూటమి రాగానే ఆక్రమించి
కేశాపురం రెవెన్యూ పొలం సర్వే నంబరు 326-2ఏలోని 2.75 ఎకరాలకు ప్రభుత్వం 1983లోనే మైలసముద్రం గ్రామానికి చెందిన కేశాని పెద్దక్కకు పట్టా ఇచ్చింది. పక్కనే సర్వే నంబరు 326-2బీలోని 2.35 ఎకరాలను మైలసముద్రం గ్రామానికి చెందిన కిలారి జానకమ్మకు పట్టా ఇచ్చింది. అయితే కేశాని పెద్దక్క పొలంపై కన్నేసిన కిలారి జానకమ్మ కుటుంబీకులు ఏళ్లుగా ఆక్రమించాలని ప్రయత్నం చేసి విఫలమయ్యారు. కానీ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువు దీరగానే మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అండదండలతో కిలారి జానకమ్మ భర్త కిలారి రామమోహన్, తనయుడు కిలారి గోవర్ధన్‌నాయుడు.. 2024 సెప్టెంబరులో 2.75 ఎకరాలను ఆక్రమించారు. పోలీసుల రక్షణతో (అప్పటి సీఐ ఇందిర) కేశాని పెద్దక్క పేరుతో ఉన్న భూమిలో టీడీపీకి చెందిన కిలారి రామమోహన్ తదితరులు మామిడి చెట్లు నాటారు. ఆ తర్వాత బోరుబావులు కూడా తవ్వించారు. దీంతో ఆ భూమి తమదని ఆక్రమణ సరికాదని కేశాని పెద్దక్క కుమారుడైన జవాన్ కేశాని రమేష్ టీడీపీ నాయకులను వేడుకున్నా వారు వినిపించుకోలేదు. పైగా పొలంలోకి వస్తే అంతుచూస్తామంటూ రమేష్ కుటుంబ సభ్యులను బెదిరించారు. దీంతో జవాన్ రమేష్ కుటుంబీకులు ఏడాది కాలంలో అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అయినా ఫలితం లేకపోవడంతో... జవాన్ రమేష్ ఓ సెల్ఫీ వీడియో రూపొందించి తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు

మంత్రి లోకేశ్‌కు చెప్పినా ఫలితం లేదు..



మా భూమికి సంబంధించి 1983 నుంచి ఆధారాలున్నాయి. ఏడాది క్రితం వరకు పొలం మా ఆధీనంలోనే ఉంది. ప్రస్తుతం ఎకరా రూ.10 లక్షలపైనే పలుకుతోంది. దీంతో కొందరు టీడీపీ నేతలు మా పొలాన్ని ఆక్రమించారు. అధికారులకు మొరపెట్టినా ఎవరు పట్టించుకోలేదు. ఇటీవల మంత్రి నారా లోకేశ్ పుట్టపర్తికి వచ్చిన సమయంలో విమానాశ్రయం వద్ద వినతి పత్రం అందజేశా. అయినా స్పందనలేదు. అవతలి వ్యక్తులు టీడీపీకి చెందిన వారు... అగ్రవర్ణాల వారు కావడంతో అధికారుల మా మొర ఆలకించడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నా. – **రమేశ్, జవాన్**

క్లుప్తంగా

కేంద్ర బృందం పర్యటన



మెళవాయిలో స్థానికులతో మాట్లాడిన కేంద్ర బృందం సభ్యులు

మడకశిర రూరల్: మండలంలోని మెళవాయి పంచాయతీలోని గ్రామాల్లో బుధవారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2025 కేంద్ర బృందం సభ్యులు రామాంజనేయులు, శ్రీనివాసులు పర్యటించారు. యూ.రంగాపురం, మెళవాయి, జక్కేపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, భోజన పథకం, అంగన్‌వాడీ సేవల అమలు తదితర వాటిని పరిశీలించారు. గ్రామాల్లో పారిశుధ్యం పరిస్థితి, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్వహణ, తడి.. పొడి చెత్త సేకరణ, చెత్త నుంచి సంపద తయారీ తదితర అంశాలపై ఆరా తీశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రంగనాథ్, ఈఓఆర్డీ నాగరాజు నాయక్, కార్యదర్శి అశ్వత్థరెడ్డి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండకు తరలిన ఓబుళ లక్ష్మీనృసింహుడు



ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తరలిస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో కొలువైన ఓబుళ లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 6న గ్రామ సమీపంలోని కొండపై ఉన్న ఆలయం నుంచి తీసుకువచ్చిన ఉత్సవమూర్తులను బుధవారం తిరిగి కొండపైకి చేర్చారు. ఈ 11 రోజుల పాటు ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం ఉత్సవ మూర్తులను నూతన వస్త్రంలో ఉంచి పూజలు చేసిన అనంతరం ఊరేగింపుగా కొండకు తరలించారు. ఈ ఉత్సవాన్ని చూసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

రేషన్ బియ్యం స్వాధీనం

పెనుకొండ రూరల్: అనంతపురం నుంచి బెంగళూరుకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని బుధవారం మధ్యాహ్నం పెనుకొండ మండలం అమ్మవారిపల్లి వద్ద కియా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బొలెరో వాహనంలో 60 సంచుల్లో (ఒక్కో సంచిలో 50 కిలోలు) ఉన్న రేషన్ బియ్యాన్ని గుర్తించి, వాహనాన్ని సీజ్ చేశారు. డ్రైవర్ ముత్యాలుతో పాటు బియ్యం వ్యాపారి సోమును అరెస్ట్ చేశారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సీఎస్‌డీటీ ప్రభావతికి అప్పగించారు.

దమ్ముంటే పట్టుకోండి!



జిల్లాలో వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగలు అతి తెలివిని ప్రదర్శిస్తున్నారు. ఎలాంటి ఆధారాలు దొరక్కుండా తిరుగుతున్నారు. ప్లాన్ చేసి దొరికిన కాడికి దోచుకుంటూ ఇటు బాధితుడికి, అటు పోలీసులకు నిద్రలేని రాత్రులను మిగుల్చుతున్నారు. దీంతో వారిని పట్టుకోవడం పోలీసులకు సవాలుగా మారుతోంది.

- సవాల్ విసురుతున్న దొంగలు
- జిల్లాలో నిత్యమూ ఏదో ఒక చోట చోరీలు
- ఇప్పటి వరకూ ఏ ఒక్క కేసులో రికవరీ చూపని పోలీసులు



పుట్టపర్తిలో చోరీకి వెళ్తున్న దొంగలు (సీసీ కెమెరా ఫుటేజీ)



ఎస్పీ ఆఫీస్ దగ్గరలో చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

సాక్షి, పుట్టపర్తి: జిల్లాలో చోటు చేసుకుంటున్న వరుస దొంగతనాలు పోలీసుల పనితీరును సవాల్ చేస్తున్నాయి. జిల్లా కేంద్రంలో కలెక్టర్ బంగ్లా పక్కనే.. ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే వరుస చోరీలు చోటు చేసుకున్నాయి. తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసుకుని రాత్రి, పగలు తేడా లేకుండా దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇంటి బయట రాత్రి ఉంచిన బైకులు తెల్లవారేసరికి మాయం అవుతున్నాయి. ఏడాది క్రితం ఎన్నికలకు ముందు సాక్షాత్తూ కలెక్టర్ బంగ్లాలోనే బంగారం అపహరించిన ఘటన జిల్లాను కుదిపేసింది. అయితే ఇప్పటి వరకూ ఏఒక్క కేసు దర్యాప్తులోనూ పోలీసులు పురోగతి సాధించలేకపోయారు. బాధితులకు న్యాయం జరిగిన దాఖలాలూ లేవు.

ఏడాది వ్యవధిలోనే..

- పుట్టపర్తిలోని జానకీరామయ్య కాలనీలో నివాసముంటున్న ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉదయం 9 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి మెయిన్ రోడ్డుపైకి చేరుకుని టిఫిన్ తిని ఇంటికెళ్లాడు. అప్పటికే తాళం బద్దలుగొట్టి ఉంది. లోపలకెళ్లి చూస్తే చార్జింగ్ పెట్టి ఉన్న మొబైల్ కనిపించలేదు. ఘటనపై పోలీసులు కేసు సైతం నమోదు చేశారు. అయితే ఇప్పటి వరకూ రికవరీ చేయలేకపోయారు.
- సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి క్వార్టర్స్ గేటు ఎదురుగా చిల్లర దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తి రోజూ ఉదయాన్నే తన బైకును పగటి పూట చెట్టు కింద పార్క్ చేసి వ్యాపార లావాదేవీలు చూసుకుంటూ ఉంటాడు. ఓ రోజు ఉదయం పార్క్ చేసిన బైక్.. చీకటి పడే లోపు మాయమైంది. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. ఇప్పటి వరకూ కేసు నమోదు చేయలేదని బాధితుడు వాపోతున్నాడు.
- చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురానికి చెందిన ఓ వ్యక్తి ఉదయం 7 గంటలకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వచ్చాడు. టోకెన్ తీసుకుని.. వైద్యం పొందిన తర్వాత 11.30 గంటలకు బయలకు వచ్చి చూడగా.. బైక్ కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు.
- ఎన్నికలకు ముందు కలెక్టర్ నివాసముంటున్న బంగ్లాలోనే బంగారం ఎత్తుకెళ్లారు. కేసు దర్యాప్తు ఏమైందో? దొంగ ఎవరో? ఇప్పటికీ వెల్లడించలేదు. కొన్ని రోజుల పాటు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయినా ఇప్పటికీ అరెస్ట్ చూపలేదు.
- మూడు నెలల క్రితం పుట్టపర్తి పట్టణ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో జనరల్ ఆస్పత్రికి వచ్చిన ధర్మవరం మండలం పోతుకుంటకు చెందిన ఓ వ్యక్తి బైక్ గంట వ్యవధిలోనే మాయమైంది. ఇప్పటికీ రికవరీ చేయలేదని బాధితుడు పేర్కొన్నాడు.

ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే..

పుట్టపర్తి టౌన్: ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న సత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ స్టాఫ్ క్వార్టర్స్‌లోని తొమ్మిది ఇళ్లలో దుండగులు ప్రవేశించి, విలువైన బంగారు ఆభరణాలను అపహరించారు. బుధవారం వేకువజామున ఈ ఘటన చోటు చేసుకుంది. క్వార్టర్స్‌లోని మూడు బ్లాకుల్లో ఉన్న తొమ్మిది ఇళ్లల్లో ఏకకాలంలో బీభత్సం సృష్టించి రూ.9లక్షల నగదు, 34 తులాల బంగారం ఎత్తుకెళ్లినట్లు బాధితులు చెబుతున్నారు. క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న ఎలక్ట్రీషియన్ శ్రీనివాసులు ఒక్కడి ఇంట్లోనే రూ.8లక్షల నగదు, 29 తులాల బంగారు నగలను దుండగులు అపహరించారు. నగదు, బంగారాన్ని తన కుమార్తె వివాహం కోసం సిద్ధం చేసి ఉంచినట్లు బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీంను రంగంలో దించి దుండగుల వేలి ముద్రల ఆధారాల కోసం జల్లెడ పట్టారు. స్నిఫ్పర్ డాగ్‌ను రప్పించి దుండగుల కదలికలను పసిగట్టారు. ఆయా ఘటనలపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, ఇదే ప్రాంతంలో కలెక్టర్ నివాసం ఉంటున్నారు. వీఐపీ ప్రాంతం కావడంతో భద్రత పటిష్టంగానే ఉంటోంది. అయినా వరుస చోరీలు చోటు చేసుకోవడంతో పోలీసుల పనితీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- కర్ణాటక నాగేపల్లి వద్ద ఉన్న సందీప్ విల్లాలో నివాసముంటున్న ఓ ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో సుమారు రూ.25 లక్షలు విలువ చేసే బంగారం చోరీకి గురైంది. ఈ కేసు దర్యాప్తులోనూ పురోగతి లేదు.
- పుట్టపర్తి మున్సిపాలిటీ వెస్ట్ గేట్‌కు వెళ్లే దారిలో ఓ మహిళ మెడలో చైన్ లాక్కెళ్లారు. ఇప్పటి వరకూ రికవరీ చేయలేదని బాధిత మహిళ వాపోతోంది.

మరిచే లోపు మరో ఘటన

పుట్టపర్తిలో చోరీల కలకలం.. నిత్య వార్తగా మారింది. ఒక ఘటన మరిచే లోపు మరో చోరీ వెలుగు చూస్తోంది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత (బుధవారం వేకువజాము 3.52 గంటల సమయంలో.. సీసీటీవీ ఫుటేజీల ప్రకారం) పుట్టపర్తిలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి క్వార్టర్స్ ఎఫ్ బ్లాక్‌లో 9 ఇళ్లలో వరుస చోరీలు జరిగాయి. రూ.8.25 లక్షల నగదు, 34 తులాల బంగారాన్ని దుండగులు అపహరించారు. తన కుమార్తె పెళ్లి కోసం దాచిన మొత్తం బంగారాన్ని ఎత్తుకెళ్లారంటూ ఎలక్ట్రీషియన్ శ్రీనివాసులు కన్నీటి పర్యంతమయ్యారు.

తమ్ముడూ.. అమ్మను బాగా చూసుకో

- తెలంగాణలో గుత్తి మండలానికి చెందిన యువకుడి ఆత్మహత్య



రేవంత్‌కుమార్ (ఫైల్)

గుత్తి రూరల్: 'తమ్ముడూ.. అమ్మను బాగా చూసుకో' అంటూ ఓ యువకుడు వీడియో కాల్‌లో తన సోదరుడికి సూచించి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన మేరకు.. గుత్తి మండలం టి.కొత్తపల్లికి చెందిన సూర్యనారాయణ, శారదమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు కాగా, పెద్ద కుమారుడు నంద్యాల రేవంత్ కుమార్ (28) ఇంటికి పెద్ద దిక్కుగా ఉంటూ తమకున్న 8 ఎకరాల్లో తమ్ముడు కిరణ్ కుమార్‌తో కలసి పంటలు సాగుతో పాటు బొలెరో వాహనం నడుపుతూ జీవనం సాగించేవాడు. పంటల సాగుతో పాటు బొలెరో వాహనం కొనుగోలుకు అప్పులు చేశాడు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు పండక నష్టపోయాడు. అలాగే బొలెరో వాహనానికి సరైన బాడుగలు లేకపోవడంతో నెలవారీ కంతులు కట్టుకోలేక రూ.16లక్షల వరకూ అప్పుల పాలయ్యాడు. దీంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదంటూ తరచూ మదనపడేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి గుత్తి నుంచి మిరపకాయల లోడు తీసుకుని హైదరాబాద్‌కు బయలుదేరిన రేవంత్‌కుమార్... తెలంగాణలోని వనపర్తి జిల్లా పెబ్బేరు వద్దకు చేరుకోగానే వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి తమ్ముడికి వీడియో కాల్ చేశాడు. 'ఇక నేను మీకు భారం కాను... అమ్మను బాగా చూసుకో' అని చెప్పి పురుగుల మందు తాగాడు. గమనించిన బొలెరో వాహన క్లీనర్ వెంటనే అప్రమత్తమై వనపర్తి జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రేవంత్ మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు పోలీసులు అప్పగించారు.

'కేఎస్ఎన్' డిగ్రీ ఫలితాల విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రెండో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను బుధవారం ప్రిన్సిపాల్ కేసీ సత్యలత, పరీక్షల విభాగాధిపతి హెచ్.శివశంకర్ బుధవారం విడుదల చేశారు. 623 మంది విద్యార్థినులు పరీక్ష రాయగా 71.75 శాతంతో 447 మంది ఉత్తీర్ణత సాధించారు. బీఏ (ఆనర్స్)లో 85 మందికి గాను 61 మంది, బీకాం (ఆనర్స్)లో 221 మందికిగాను 160 మంది, బీఎస్సీ (ఆనర్స్)లో 228 మందికి గాను 214 మంది, బీబీఏలో 29 మందికిగాను 12 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫలితాలను కళాశాల ఎగ్జామినేషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. రీవాల్యుయేషన్, పర్సనల్ వెరిఫికేషన్‌కు సంబంధించి ఈ నెల 21 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. రీవాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.300, పర్సనల్ వెరిఫికేషన్‌కు రూ.600 చెల్లించాలని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల ఉప విభాగాధిపతి రమణ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీరంగయ్య, రామలింగారెడ్డి, నాగభూషణం, సింధు, రామకృష్ణ, రామాంజనేయులు, రేణుకాదేవి, ఆదినారాయణ, పర్వీన్, అనురాధ, రమాదేవి, లక్ష్మి, యూడీసీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'నగదు బదిలీ పథకం ఉపసంహరించుకోవాలి'



మహాసభలో మాట్లాడుతున్న హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ

పుట్టపర్తి టౌన్: హమాలీలకు శాపంగా మారే నగదు బదిలీ పథకం అమలు ఆలోచనను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని రాష్ట్ర పౌరసరఫరాల హమాలీల వర్కర్ల యూనియన్ అధ్యక్షుడు ఆర్.కృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక సాయి ఆరామంలో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా హమాలీ యూనియన్ 5వ మహాసభలు జరిగాయి. అంతకు ముందు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి సాయి ఆరామం వరకూ హమాలీలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో కృష్ణ మాట్లాడారు. హమాలీలను 4వ తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రతి నెలా 5న వేతనాలు చెల్లించాలని, సరుకు లోడింగ్.. అన్‌లోడింగ్ పనిని ఐదు రోజులకు కుదించాలని, హమాలీల ప్రాణాలకు ముప్పు తెచ్చే విధానాన్ని రద్దు చేసి 12 రోజుల పనిదినాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. హమాలీల కుటుంబాలకు అందాల్సిన పరిహారం త్వరగా అందించాలని కోరారు. అనంతరం జిల్లా హమాలీ యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నేలకోటప్ప, ఉపాధ్యక్షులుగా శ్రీరాములు, చుక్కలింగం, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా రామదాసుతో పాటు 11మంది సభ్యులను ఎన్నుకున్నారు.

అండర్–16 జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఏడీసీఏ కార్యదర్శి భీమలింగారెడ్డి

అనంతపురం: ఈ నెల 17 నుంచి 31వ తేదీ వరకూ వైఎస్సార్ జిల్లా కడపలో జరిగే అండర్–16 సౌత్ జోన్ క్రికెట్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించే జిల్లా జట్టును బుధవారం ఎంపిక చేశారు. ఎంపికైనా వారిలో ఆర్.సాత్విక్ (కెప్టెన్, అనంతపురం), ఎన్.సంజయ్‌కుమార్ (వైస్ కెప్టెన్, నార్పల), జి.కౌశిక్ (వికెట్ కీపర్, అనంతపురం), కె.అశ్విన్, యు.తన్మయ్ కార్తీక్‌రెడ్డి, అభినవ్ సాత్విక్ రెడ్డి, కుషాల్ సాయి, దేవాన్ష్, టి.కిరణ్‌కుమార్, వై.లిఖిత్, పి.నిహార్, ఎస్.కార్తీక్ (అనంతపురం), జియాద్ (హిందూపురం), జె.సంతోష్ (కదిరి), బి.అఖిల్ కుమార్ (గోరంట్ల), ఆదినారాయణ రెడ్డి (ఆత్మకూరు), బి.అఖిల్ కుమార్ (గొట్లూరు) ఉన్నారు.

ఉల్లాసంగా ఉట్ల పరుష



అప్పరాచెరువులో ఉట్లమాను ఎక్కుతున్న యువకులు

బత్తలపల్లి/ధర్మవరం రూరల్: మండలంలోని అప్పరాచెరువు గ్రామంలో మొహర్రం ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన ఉట్ల పరుషను ఉత్సాహంగా సాగింది. పీర్ల చావిడి ఎదుట ఏర్పాటు చేసిన 40 అడుగుల ఎత్తైన ఉట్ల మానును ఎక్కేందుకు సాయంత్రం 5 గంటలకు గ్రామంలోని వాల్మీకి (బోయ) సామాజిక వర్గానికి చెందిన 20 మంది యువకులు పోటీ పడ్డారు. వేడుకను చూసేందుకు చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో అప్పరాచెరువు జనసంద్రమైంది. చివరికి రవితేజా అనే యువకుడు ఉట్లమాను పైకి ఎక్కడంతో ప్రజలు చప్పట్లు కొట్టి అభినందించారు. అంతకు ముందు మరగాళ్ల, కోలాటం, కీలుగుర్రాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అలాగే ధర్మవరం మండలం చిగిచెర్లలోనూ బుధవారం ఉత్సాహంగా ఉట్ల పరుషను గ్రామస్తులు నిర్వహించారు. అంతకు ముందు పీర్ల మకాన్‌లో ఉన్న మౌలాలీ స్వామికి చక్కెర చదివింపులు చేసి గజమాలలతో అలంకరించారు.

బ్లాస్టింగ్‌తో భయాందోళన

- పోలీసులకు ఫిర్యాదు చేసిన రెండు గ్రామాల ప్రజలు

నల్లమాడ: గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా చెరువువాండ్లపల్లి, సి.కొత్తపల్లి గ్రామాలకు సమీపంలో కాంట్రాక్టర్లు చేపట్టిన బ్లాస్టింగ్‌లతో ఆయా గ్రామాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. భయంకరమైన శబ్దాలతో పాటు రాళ్లు ఎగిసిపడి పంట పొలాలు, గ్రామంల్లోని ఇళ్లపై వచ్చి పడుతున్నట్లు పలువురు వాపోయారు. భారీ శబ్దాలకు భవనాలు కంపిస్తున్నాయన్నారు. టీవీలు పేలిపోతున్నాయని గ్రామాలకు చెందిన రామచంద్ర, రమేష్‌రెడ్డి, ఎం.కృష్ణారెడ్డి, వేణుగోపాలరెడ్డి, శ్రీనివాసులు, గంగరాజు, వనజ, సుజాత, రాధమ్మ తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, రాళ్లు మీదపడి ప్రాణాలు కోల్పోతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఓపెన్ బ్లాస్టింగ్ జరపకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల 14న స్థానిక పోలీసులకు లిఖితపూర్వక ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



ఎరువుల దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

పెనుకొండ రూరల్: పట్టణంలోని పలు ఎరువుల దుకాణాను విజిలెన్స్ అధికారులు శివకుమార్, శివన్న, ప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. పురుగు మందులు, ఎరువులు, విత్తనాలకు సంబంధించిన రికార్డులు, నిల్వలు పరిశీలించారు. ఎస్ఎల్‌వీ, మన ఆగ్రో దుకాణాల్లో రికార్డులు సరిగాలేని 46 క్వింటాళ్ల విత్తనాలను గుర్తించారు. రూ.13.27 లక్షల విలువైన సరుకు విక్రయాలను నిలుపుదల చేస్తూ నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా వారి వెంట స్థానిక ఏఓ చందన ఉన్నారు.

వృద్ధురాలిపై దాడి

- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

గాండ్లపెంట: మండలంలోని మలమీదపల్లి పంచాయతీ బనాన్‌చెరువుపల్లికి చెందిన 78 ఏళ్ల వయసున్న ఎం.సరస్వతిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. దీంతో ఆమె తలపై లోతైనా గాయాలయ్యాయి. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి వివరాలు.. ఈ నెల 12న ఉదయం 10.30 గంటలకు ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై గుర్తు తెలియని దుండగులు దాడి చేశారు. గుర్తించిన స్థానికులు వెంటనే ఆస్పత్రికి చేర్చి, విషయాన్ని అన్నమయ్య జిల్లా మదనపల్లిలో నివాసముంటున్న కుమారుడు సుబ్బారెడ్డికి తెలిపారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో సమాచారాన్ని బావ నరసింహారెడ్డికి చేరవేశాడు. అప్పటికే నల్లచెరువు మండలం పాలపటిదిన్నె ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చిన ఆయన వెంటనే బనాన్‌చెరువుపల్లికి చేరుకుని పరిశీలించాడు. బాత్రూమ్‌లో పడి గాయపడి ఉంటుందని భావించి కదిరిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. వృద్ధురాలి తలపై లోతైన గాయాలను గుర్తించిన వైద్యులు అవి బలంగా కొట్టడం వల్ల అయిన గాయాలుగా నిర్ధారించారు. దీంతో ఆగమేఘాలపై అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. బుధవారం ఉదయం నరసింహారెడ్డి బనాన్‌చెరువు పల్లికి చేరుకుని ఇంటిని క్షుణ్ణంగా పరిశీలంచాడు. ఇంటి వద్ద రక్తపు మరకలైన కట్టెతో పాటు గుర్తు తెలియని వ్యక్తుల చెప్పులు, టవాలు పడి ఉండడం గుర్తించి ఫిర్యాదు చేయడంతో ఎన్‌పీకుంట ఎస్ఐ వలీబాషా, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. నరసింహారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పన్ను వసూలులో నిర్లక్ష్యం వద్దు : డీపీఓ



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ సమత

పరిగి: గ్రామ పంచాయతీల పరిధిలో నీటి, ఇంటి పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వీడాలని పంచాయతీ కార్యదర్శులను జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) సమత ఆదేశించారు. బుధవారం ఆమె పరిగి మండలంలో పర్యటించారు. తొలుత పి.నరసాపురం గ్రామానికి చేరుకున్న ఆమె డ్రైనేజ్ వ్యవస్థను పరిశీలించారు. కాలువలు అధ్వానంగా ఉన్నాయని, వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలని కార్యదర్శి తిప్పన్నను ఆదేశించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు పక్కన చెత్త వేయకుండా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. నీటి నిల్వ ప్రదేశాలను బ్లీచింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డప్ప, వివిధ గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

నేత్రదానం



సేకరించిన నేత్రాలను అందిస్తున్న మృతుని కుటుంబ సభ్యులు

ధర్మవరం అర్బన్: మరణానంతరం తన నేత్రదానంతో ఇద్దరికి కంటిచూపును అందించారు ధర్మవరం మండలం గొట్లూరుకు చెందిన బండ్ల నారాయణ(80). బుధవారం ఆయన అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న విశ్వదీప సేవా సంఘం వ్యవస్థాపకుడు కోళ్లమొరం చంద్రశేఖరరెడ్డి వెంటనే బాధిత కుటుంబసభ్యులను కలసి నేత్రదానంపై అవగాహన కల్పించడంతో వారు అంగీకరించారు. దీంతో మృతుని నేత్రాలను జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ డాక్టర్ కుల్లాయప్ప, కంటి రెట్రావైల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర సేకరించారు. నేత్రదానానికి సహకరించిన మృతుని కుమారుడు బండ్ల మంజునాథ్, కోడలు శ్రీవనిత, కుమార్తె భాగ్యలక్ష్మి, తమ్ముడు బండ్ల రామాంజనేయులుకు విశ్వదీప సేవా సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సురేష్, ఉపాధ్యక్షుడు టి.చంద్రశేఖర్‌రెడ్డి, సభ్యులు ఖమ్మం మాధవ, జుజారు రఘు, ప్రభాకర్‌రెడ్డి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం యాదవ వీధిలో..



వి.ఆంజనేయులు (ఫైల్)

- **ధర్మవరం:** స్థానిక యాదవవీధికి చెందిన వేల్పుమడుగు ఆంజనేయులు(62) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న యువర్స్ ఫౌండేషన్ సభ్యులు వైకే శ్రీనివాసులు, డాక్టర్ బీవీ సుబ్బారావు, కౌన్సిలర్ కేతా లోకేష్.. మృతుని కుటుంబ సభ్యులను కలిసి నేత్రదానంపై అవగాహన కల్పించడంతో వారు అంగీకరించారు. దీంతో మృతుని నేత్రాలను జిల్లా అంధత్వ నివారణ సంస్థ డాక్టర్ కుల్లాయప్ప, కంటి రెట్రావైల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర, ఆప్తమాలిక్ ఆఫీసర్ షేక్ సికిందర్ సేకరించారు. నేత్రదానానికి సహకరించిన మృతుని సోదరులు రాము, ప్రసాద్‌కు యువర్స్ ఫౌండేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయంలో చోరీ

తనకల్లు: మండల పరిధిలోని పెద్దపల్లిలో వెలసిన గంగమ్మ ఆలయంలో బుధవారం చోరీ జరిగింది. ఆలయ తాళాలను తొలగించి లోపలకు ప్రవేశించిన దుండగులు హుండీని పగులగొట్టి అందులోని నగదుతో పాటు గర్భగుడిలోని ఇతర సామగ్రిని అపహరించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.


యువకుడి ఆత్మహత్య



మంజునాథ్ (ఫైల్)

గుడిబండ: మండలంలోని బాలేపట్టికి చెందిన మంజునాథ్ (30) ఆత్మహత్య చేసుకున్నాడు. బాలేపల్లి ఎస్సీ కాలనీలో నివాసముంటున్న రామలింగప్పకు ముగ్గురు సంతానం కాగా, మంజునాథ్ రెండో కుమారుడు. ఇంకా వివాహం కాలేదు. తరచూ కడుపు నొప్పితో బాధపడేవాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాలేదు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి నొప్పి తీవ్రత తట్టుకోలేక స్టోర్ రూమ్‌లోకి వెళ్లి దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజ్‌కుల్లాయప్ప తెలిపారు.

పాము కాటుతో మహిళా రైతు మృతి



సువర్ణ (ఫైల్)

ముదిగుబ్బ: మండలంలోని సిద్దన్నగారిపల్లికి చెందిన మహిళా రైతు సువర్ణ (44) పాముకాటుతో మృతి చెందారు. తన భర్త శివారెడ్డితో కలసి బుధవారం వ్యవసాయ తోటలో పని చేస్తుండగా చేతిపై పాము కాటు వేసింది. వెంటనే బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. పరీక్షించిన అక్కడి వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.